# తులసీదాసు

*(తృష్ణ పాపకర్మలను ప్రేరేపించు నారి, ఆశలచే బాధింపబడు మానవునకు, 'రామచరితమానస' మను అమృతమును పానము గావించిన పవిత్రజీవి ఈ తులసీదాసు. వాంఛారహితుని మాత్రమే రాముడు వరించుననియు, అట్టి వానినే తరింపజేయుననియు, హృదయమున రామనామమును నింపి, కరమున కర్తవ్యకర్మల నాచరింపుమనియు ప్రబోధించెను. అతని కీర్తనలలో ప్రేమోన్మత్తము ప్రదర్శించెను. క్షణభంగురమైన ఈ కాయముల పోషణకై కాలమును దుర్వినియోగ పరచక, చిక్కిన కాలమును చిత్తశుద్ధికై వినియోగించుడనియు, చిత్తశుద్ధి అవధూత స్థానమును అందించుననియు, విత్తము యమదూత ప్రాప్తి లభించుననియు గానము చేసెను. రామనామమును పానము చేసెను. అతడు వ్రాసిన పవిత్ర గ్రంథము రామాయణము. దానికే 'తులసిరామాయణ' మని పేరు. మహారాష్ట్రమున ప్రతియింటా దాని పారాయణము జరుగుచుండును.)*

*మాట యిచ్చినట్టు మనుజుండు నడచిన*
*మనిషికాదు వాడు మహితుడగును*
*మాట చెప్పినట్టు మనిషి నడువడేని*
*మనిషికాదు వాడు మృగమెగాని.*

**మాటే ప్రాణం**

మానవునియొక్క పవిత్రత, మానవునియొక్క కీర్తిమర్యాదలు, మానవునియొక్క ఉన్నతస్థితి మాటపై ఆధారపడి ఉన్నది. మాటయే మానవునికి ప్రాణము. మాట తప్పెనా ప్రాణమును పోగొట్టుకున్నట్లే. ఈ మానవునియొక్క మాటలకు ఖర్చులేదుగానీ విలువ ఎక్కువ. ఇలాంటి విలువైన మాటను మానవుడు నిలుపుకున్నప్పుడే మానవత్వాన్ని సార్థకముగావించుకున్న వాడౌతాడు. తన మాటను తాను పోషించుకునే నిమిత్తమై జీవితమునే త్యాగము చేసి, దివ్యత్వమును అనుభవించి పవిత్రమును ప్రచారము గావించినవాడే తులసీదాస్.

**జననం**

ఇతడు ఆత్మారామ్ దూబే, తులసి అనే దంపతులకు (విక్రమశకము 1554 లో పుట్టాడు) క్రీస్తుశకము 1493 వ సంవత్సరము శ్రావణమాసము శుక్ల సప్తమి రోజు జన్మించాడు. సామాన్యంగా పుట్టిన బిడ్డ తక్షణమే ఏడుస్తుంది. దీనికి ఆధ్యాత్మికంగా ఒక అర్థము, వైజ్ఞానికంగా ఒక అర్థము ఉన్నాయి.

తల్లిగర్భాన నుండి పుట్టిన తక్షణంబె
కెవ్వుకెవ్వున ఏడ్తురు నవ్వకుండ
ఏడ్చుటేలకో తెల్పెదనిపుడు మీకు
దినదినమ్మును తెలిపెడి తెరగు చూడ.

అనగా మన జీవితము చాలా కష్టములతో, నష్టములతో, దుఃఖములతో విచారములతోకూడినదని మున్ముందు మనకు తెలుస్తుంది. కనుక, ముందు రాబోయే దుఃఖములకు, విచారములకు సూచనగా తాను ప్రారంభములోనే ఏడుస్తాడని ఒక ఆధ్యాత్మిక అర్థము. తల్లి గర్భమునందుండినప్పుడు ఈ బిడ్డ దశేంద్రియములందు నీరు నిండి ఉంటుంది. ఈ బిడ్డ చుట్టూ, లోపల, సర్వత్ర నీరు ఉంటుంది. ఇది భగవత్ సృష్టియొక్క రహస్యము. ముక్కు,

కన్నులు, చెవులు, నోరు అన్ని ఇంద్రియములందు నీరు నిండుకోటం చేత, ఏడ్వటం వలన ఆనీరంతా పోయి ఉఛ్వాసనిశ్వాసములు ప్రారంభమౌతాయి. ఆవిధముగా యేడ్వని బిడ్డలను నర్సులు కాళ్లు పట్టుకొని, తల క్రిందకు పెట్టి చల్లని నీళ్లతో కొడతారు. అప్పుడు ఆ బిడ్డ ఏడుస్తుంది. ఈ ఏడ్చినప్పుడు సక్రమముగా రక్తము ప్రసరించి ఉఛ్వాసనిశ్వాసములు ప్రారంభమౌతాయి. దేహము చక్కగా ఆరోగ్యంగా ఉంటుంది. ఉచ్ఛ్వాసనిశ్వాసములు ప్రారంభముకాక, రక్తము ప్రసరించకుండా పోవటంచేత దేహము నీలంగా మారిపోతుంది. బయటకు వచ్చిన తక్షణమే ఆ బిడ్డ ఆరోగ్యానికి, జీవితానికికూడ ప్రమాదము యేర్పడుతుంది. కనుకనే, పుట్టిన తక్షణమే ఏడ్వటం ప్రతి బిడ్డకు సహజం. అయితే ఈ తులసీదాస్ పుట్టిన తక్షణమే యేడ్వలేదు. ఏడ్వకపోవటంచేత అక్కడున్న అమ్మలక్కలు, 'అయ్యో! ఏమిటో పుట్టిన తక్షణమే ఏడ్వాలి. ఇది సరైన జననము కాదు. ఏదో దోషాలు ఉంటున్నాయి. దయ్యంబిడ్డో, పీడబిడ్డో' అని అనేకరకాలుగా మాటలు ప్రారంభించారు. దీనికి తగినట్లుగా ఆనాడు రాత్రి తులసికి తీవ్రమైన జ్వరము వచ్చింది. ఇది అలసటవల్ల వచ్చిందేమో అని అనుకొని ఆడవారు అదోయిదో మందు యిచ్చారుగానీ నయము కాలేదు. రెండవరోజు మరింత ప్రమాద స్థితికి వచ్చింది. నాల్గవ దినము ఏకాదశినాడు తల్లి మరణించింది.

తులసి మరణించేటప్పటికి ఈ బిడ్డను చూసుకొనేవారు లేకపోయారు. అందువల్ల ఈ బిడ్డను ప్రక్కయింటిలో ఆమెకు యిచ్చారు. ఆమెను సాకమన్నారు. బిడ్డకు ఐదు సంవత్సరములు వచ్చిన తరువాత ఆమె మరణించింది. అందువల్ల ఆ గ్రామస్థులు కొంతమంది చేరి అదే గ్రామములోపల రామశైలాశ్రమములో చేర్చారు ఆ బిడ్డను. ఆశ్రమ యజమాని నరహరిదాసు. ఆయన ఈ బిడ్డను చాలా ప్రేమతో పెంచుకొని, ఒక అధ్యాపకునిపెట్టి చదువు చెప్పించటానికి ప్రారంభించాడు. సాయంకాలము వచ్చే భక్తులకు రామాయణాన్ని చెబుతూ ఉండటం ఆ ఆశ్రమ పద్ధతి. ఆసమయంలో ఆ పిల్లవాడు అక్కడపోయి కూర్చొని ఈ రామకథను చక్కగా వింటూ క్రమక్రమేణా పాడుకుంటూ ఉండేవాడు.

**రామచింతనం**

ఒకనాడు ఈ పిల్లవాడు సుస్వరముతో రామాయణం చక్కగా పాడుతుంటే బయటినుండి విని నరహరిదాసు తనలోతాను ఆనందించాడు. పిల్లలు యేవో పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుకోటం కాలానుగుణ్యంగా జరుగుతుంది కానీ ఈ పిల్లవాడు వేరే మాటలలో యేమాత్రమూ ప్రవేశించలేదు. నిరంతరము రామచింతన చేస్తూ, రామునిపై పాటలు పాడుకుంటూ ఉండేవాడు. ఆశ్రమములో నరహరిదాసు ఒక్కొక్కరికీ ఒక్కొక్క పని యిచ్చాడు. ఈ పిల్లవానికి రాంబోలా అని పేరు పెట్టాడు. 'నాయనా! ఈ తులసి మొక్కలకంతా నీరుపోసి చూసుకుంటూ ఉండు' అన్నాడు. రాంబోలా ఆ తులసిమొక్కలను ప్రాణసమానంగా చూసుకుంటూ వచ్చాడు. నీరుపోయటం, ఎరువు వేయటం, ఎండిపోయిన కొమ్మలు తీసివేయటం, ఆ తులసిని పరిశుద్ధముగా చేస్తూవచ్చాడు. చదువుకొనే సమయంలో చదువుకోటం, మిగతా కాలము వ్యర్థం చేయకుండా ఆ తులసివనములో సేవ చేస్తూ వచ్చాడు. కాలక్షేపానికి వచ్చేవారంతా ఈ పిల్లవాడు చేస్తున్నదంతా చూచి, తులసికి సేవ చేస్తున్నాడని 'తులసిదాసు' అని యితనికి పేరు పెట్టారు. ఇది పెట్టిన పేరుకాదు. ప్రజలనుండి పుట్టిన పేరు. ఈవిధముగా తాను సేవ చేసుకుంటూ, వంటరిగా ఉన్నప్పుడు గురువుగారు చెప్పిన రామాయణ విషయాన్నంతా పాటలుగాను, శ్లోకాలుగాను అల్లుకుంటూ అభివృద్ధిపరచుకున్నాడు. ఇరవైరెండు సంవత్సరములు వచ్చాయి. పిల్లవాడు సద్గుణవంతుడు. సదాచార పరుడు. రూపవంతుడు. అదే గ్రామములో ఒక బీద బ్రాహ్మణుడు ఉన్నాడు. ఈ నరహరిదాసును, 'స్వామీ! మాకు ఏకైక పుత్రిక ఉంది. ఆ అమ్మాయినిచ్చి యితనికి పెండ్లిచేయాలని ఆలోచిస్తున్నాము. మీ అభిప్రాయము ఏమిటి?' అని ప్రశ్నించారు. 'నాయనా! ఇది చాలా మంచిది. లోకములో దేశకాలపాత్రలననుసరించి కాలకర్మకారణకర్తవ్యాలను పురస్కరించుకొని ఆసమయంలో వారికి ఒక బాధ్యత అందించటం మంచిది. ఆ అబ్బాయిని విచారించి చెబుతాన'న్నాడు.

## వివాహం

రెండవరోజు అబ్బాయి దగ్గరకు వచ్చాడు. 'నాయనా! రాంబోలా! నీకు పెండ్లి చేయాలనుకుంటున్నాను. నీకిష్టమేనా?' అడిగాడు. ఈకాలం పిల్లలు అబ్బబ్బ నాకు పెండ్లి వద్దంటారు. నోటితో వద్దంటారుగానీ మనసులో యెంతో ఆశగా ఉంటారు. ఇది సహజము. ఆనాడు రాంబోలా కూడా, 'నాకు పెండ్లి వద్దు స్వామీ! నేను యీవిధంగానే ఉంటాను. నా జీవితం తమ సేవకే అంకితం కానివ్వండి' అని చెప్పాడు. నరహరిదాసు కనిపెట్టాడు. ఇదేదో వారు నోటితో చెప్పవచ్చును. మనసులో వారు అరికట్టుకోలేరు. ఇది కలియుగము. ఈవిధంగా జీవించటానికి సాధ్యంకాదని నిర్ణయం చేసుకొని ఆ గ్రామంలో వారికి మాట యిచ్చాడు. ఒక ముహూర్తాన్ని నిర్ణయం చేసాడు. ఈ రాంబోలా చాలా బాధపడ్డాడు పాపం. నాకు పెండ్లి వద్దు. నేను రామసేవ చేయలేకుండాపోతాను. తులసిసేవ చేయలేకుండాపోతాను. ఈ బాధ్యత నాకు వద్దని కాళ్లు పట్టుకొని అడుక్కున్నాడు. కాని, గురువు వినలేదు. తన బాధ్యత నెరవేర్చుకున్నాడు. పూర్వము పెండ్లి వద్దన్న రామ్‌బోలా, పెండ్లి అయిన తక్షణమే క్షణమైనా ఆమెను వదలి ఉండేవాడుకాదు. ఈ హిష్టీరియా ప్రారంభమైంది. ఇది చూచాడు నరహరిదాసు. ఇది భగవంతునియొక్క లీల అనుకున్నాడు. తనయొక్క బాధ్యతను నెరవేర్చుకున్నానని తనలో తాను అనుకున్నాడు. అప్పటినుండి ఆమె వంటింట్లోకి పోతే వంటింట్లో కూర్చోటం, బయటకుపోతే బయటకు పోవటం. రెండు దేహములు ఒక్క ప్రాణంగా చూసుకుంటూ వస్తున్నాడు ఈ రాంబోలా. ఈవిధముగా రెండు సంవత్సరములు గడచింది. ఒకే గ్రామంలో వుండిన ఈ బిడ్డను పుట్టింటికి కూడా పంపడు. తల్లికేమైనా యిష్టం ఉంటే యిక్కడికే వచ్చి చూసి పోవలసిందే. వంటరిగా మాట్లాడటానికి వీలులేదు. ఈయన పక్కనే ఉండాలి. ఈవిధమైన చర్యలు చూసి భార్యకు విసుగు పుట్టింది.

## కాముని కాదు రాముని పట్టుకో

ఒకనాటి రాత్రి ఎవరో దగ్గర బంధువులు మరణించినట్లు వార్త వచ్చింది. అప్పుడే రాంబోలా నేను సాయంకాలము ఐదు గంటలకు పోయి ఆరు గంటలలోపలే వచ్చేస్తాను అని చెప్పి పోయాడు. ఆ అమ్మాయి యిదే సమయమనుకుంది. ఈ గంటలోపల తల్లిగారింటికి పోయి ఒకతూరి తల్లిని, తండ్రిని అందరినీ చూసుకొని వస్తానని ఆమె తలుపుకు తాళం వేసి ప్రక్కింటామెకు తాళంచెవి యిచ్చి, 'అమ్మా! ఆయన వస్తే తాళంచెవి యివ్వండి. నేను త్వరలోనే వస్తాను. పుట్టింటికి పోయిందని చెప్పండి' అని చెప్పి వెళ్ళింది. ఇంతలో పెద్ద గాలివాన వచ్చింది. కుంభవర్షము కురుస్తున్నాది. ఆమె రావటానికి వీలులేకపోయింది పాపం. ఈ వాన నిలిచిన తరువాత పోదాం, పోదాం అనుకుంటూ వుంది. ఈ పిచ్చి మనిషి వానలోనే వచ్చేసాడు. అక్కడ పోయిన పని జరిగిందోలేదో తిరిగి వెనుకకు వచ్చి చూస్తే బీగం వేసి ఉన్నది. ఎక్కడకు పోయిందని అనుకుంటూ ఉంటే ప్రక్కింటామె వచ్చి తాళంచెవి యిచ్చింది. పూర్వకాలంలో ఏడుగంటలకే భుజించి, దీపాలు తీసి ఎవరికివారు నిద్రించేవారు. ఆనాడు కరెంటు దీపాలు లేవు. ప్రకృతి అంతా నిద్రిస్తూ ఉంది. రాత్రి పదిగంటలకు అత్తగారింటికి పోయి తలుపు కొట్టాడు. పెద్ద కుంభ వర్షము. బట్టలంతా తడిసి నీరు కారిపోతున్నాయి. వణికిపోతున్నాడు. తలుపు కొట్టేటప్పటికి అత్తగారు లేచింది. ఆ అమ్మాయి కనిపెట్టింది. ఈసమయంలో ఎవరు వస్తారు? ఈ పిచ్చి మనిషే వచ్చి ఉంటాడు. నీవుపోవద్దు అని తల్లికి చెప్పి ఆమె వచ్చి తలుపు తెరచింది. ఇతనే. ఆమెకు చిరాకు పుట్టింది. మలమూత్ర దుర్గంధ రక్తమాంసములతో కూడిన ఈ దేహముపై ఉన్న అభిమానము, మోహము రామునిపై పెట్టకూడదా. నీవును, నీజన్మయు తరించి ఉండేవికదా! తుచ్ఛమైన ఈ దేహభ్రాంతితో యిన్ని కష్టాలకు గురైపోతున్నావు. పూర్వము రామచరితాన్ని యెంతో చింతించేవాడవు. రామభజనలు, రామకీర్తనలు పాడేవాడవు. ఈనాడు నా వల్ల రామచరితాన్ని దూరము చేసుకుంటున్నావు. ఛీ!ఛీ! ఈ దేహభ్రాంతి, దేహమోహము వుండేదానికంటె రామమోహాన్ని పెంచుకుంటే యెంత నీవు తరించి వుండేవాడవు' అని కఠినముగా చెప్పింది. ఆమెకు నిద్రాభంగమైంది. ఈ రెండేళ్లనుండి చాలా బాధలు పడింది. అందువల్ల మనసునుండి కఠినముగా వచ్చాయి.

ఆమాటలు తులసీదాసు హృదయానికి ములుకులవలె నాటుకొనిపోయాయి. తక్షణమే ఆ వర్షములోనే వెనుకకు తిరిగి రాత్రికి రాత్రే ప్రయాగ చేరుకున్నాడు. ఆనాటితో భార్యాభర్తలకు వియోగము జరిగిపోయింది.

ఈ సూటైన మాటలు తన హృదయానికి నాటుకోటముచేత మనసు పరివర్తన చెంది రామునివైపు మనసు మారిపోయింది. ఒక్కొక్క సమయంలోమనిషియొక్క ప్రభావము, సంకల్పముయొక్క పటుత్వము దానియొక్క శక్తిసామర్థ్యములు చాలా కఠినంగా వుంటుంటాయి. ప్రయాగలో తన జీవితము ప్రశాంతముగా వుండదని అక్కడనుండి చిత్రకూట పర్వతానికి చేరాడు. ఆ చిత్రకూట పర్వతము మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు మధ్య ఉంది. ఈ చిత్రకూట పర్వతముపై రామచింతన చేసుకుంటూ, రామభజన చేసుకుంటూ వున్నాడు.

**రామపూజ**

రామజన్మదినము వచ్చింది. ఆనాడు తాను రామపూజ సలిపి పరిపూర్ణ శరణాగతి చేసుకోవాలనుకున్నాడు. రాములకు షోడశోపచారములతో పూజ చేయాలని గంధము తీస్తున్నాడు. ఆసమయంలో ఒక రామచిలుక, 'తులసీదాస్! నీవు యేమి చేస్తున్నావు?' అని పలికింది. అటుయిటు తిరిగాడు. క్రింద యిద్దరు పిల్లలున్నారు. సరే యేదో నా భ్రమలోనే నాలో ఉన్న సంకల్పములయొక్క ప్రతిబింబాలే యీవిధముగా వినిపిస్తున్నాయని, 'నాయనా! మీరెవరు?' అన్నాడు. 'మేమా! ఈ అడవిలో పశువులు కాయటానికి వచ్చాము. తాతా! ఈ గంధము ఎవరికోసము?' అన్నారు. 'రామచంద్రునికోసం నాయనా!' అన్నాడు. 'మాకు కొంచెం యిస్తావా?' అడిగారు ఈ పిల్లలు. 'ఇవ్వటానికి వీలులేదు. ఇది కేవలము రామచంద్రునికి తీస్తున్నాను' అన్నాడు. అంతలోపల పక్షి మరొక పలుకు పలికింది. 'తులసీదాస్! ఆ పిల్లలు ఎవరనుకున్నావు? రామలక్ష్మణులు. నేను హనుమంతుడను' అని చెప్పి బుఝున ఎగిరిపోయింది. ఇంతలోపలే యితను రామలక్ష్మణులా అని కళ్ళు మూసుకున్నాడు. ఆ పిల్లలు అక్కడున్న గంధాన్ని తులసీదాసు నొసటికి రాసారు. వాళ్ళుకూడా అంతర్ధానమై పోయారు. అనగా దానియొక్క అంతరార్థము యేమంటే పూర్వము ఉండిన అపవిత్రమైన సంకల్పములు, ఆ దుర్గంధములంతా ఈనాటినుండిపోయి సుగంధమైన భావములు నీలో ప్రవేశించుగాక!' అని అనుగ్రహాన్ని యీవిధముగా అందించారు. అప్పటినుండి రామచరితాన్ని వ్రాసుకుంటూ వచ్చాడు.

**తులసీరామాయణం**

తులసీదాసు మహాకవి. హిందీ భాషలో 'రామచరిత మానస్' అనే మహాకావ్యాన్ని వ్రాసాడు. తన కావ్యంలో లంకా పట్టణ వైభవాన్ని వర్ణిస్తూ, 'లంకలో రాజభవనాలు ఆకాశాన్ని అందేలా వున్నాయి. ఉద్యాన వనాలలోని పూలతోటలన్నీ తెల్లని పుష్పాలతో నిర్మల చిత్తాలను నిరూపించేవిగా వున్నా'యని వ్రాసాడు. రామనామం ఎక్కడ స్మరింపబడుతూ వుంటుందో అక్కడ హనుమంతుడు వుంటాడు. అతడు వాయుపుత్రుడు కనుక సర్వత్రా నిండి వుంటాడు. రామనామం జపించే చోట గోచరిస్తూ వుంటాడు. తులసీదాసు భక్తులకు లంకాపట్టణ శోభను వర్ణించి చెప్పటం హనుమంతుడు అదృశ్యంగా వుండి విన్నాడు.

ఒకనాడు తులసీదాసు వచ్చే సమయానకి ముందుగా హనుమంతుడు అక్కడికి వచ్చి కూర్చున్నాడు. తులసీదాసు రాగానే, 'తులసీదాస్! నీవు వ్రాసిన కవిత్వం తప్పు. లంకలో పుష్పాలు తెల్లగా వున్నవా? నేనెక్కడా చూడలేదు. అన్నిచోట్లా ఎఱ్ఱని పుష్పాలనే చూచాను. నేను స్వయంగా చూచాను. నీవు లంకకు వెళ్ళలేదు. చూడలేదు. కేవలం వర్ణించి చెబుతున్నావు. సత్యవాక్పరిపాలకుడైన రాముని చరిత్రలో అసత్యం వుండటానికి వీలులేదు. ఆ పద్యాలను నీవు వ్రాసిన రామాయణమునుండి తీసెయ్యి' అంటూ చాలాసేపు వాదించాడు.

తులసీదాసు, 'సత్యస్వరూపుడైన రామచంద్రుని చరిత్రలో నేను అసత్యాన్ని చేర్చలేదు. నేను వ్రాసినదే సత్యము' అంటూ హనుమంతునితో వాదించాడు. ఇద్దరికీ వాదోపవాదాలు సాగుతున్నాయి. ఇద్దరికీ ఆరాధ్య దైవం రాముడే. వీరి వాదన మితిమీరటం వలన శ్రీరాముడు ప్రత్యక్షమై, 'హనుమంతా! తులసిదాసు వర్ణించినది పరమ సత్యము' అన్నాడు. అపుడు హనుమంతుడు, 'నేను లంకలో చూచినది అసత్యమా?' అని ప్రశ్నించాడు. 'నీకు

రావణునిపై క్రోధం వలన నీ కన్నులు ఎఱ్ఱబడి, నీకు లంకలోని తెల్లపుష్పాలుకూడా ఎఱ్ఱగా కనబడ్డాయి. ఇది నీ దృష్టి దోషమేగాని పదార్థ దోషం కాదు' అన్నాడు.

శ్రీరామచంద్ర కృపాళు భజమన హరణ భవభయ దారుణమ్
నవకంజలోచన కంజముఖ కరకంజ పదపంకజారుణమ్.

ఓ రామచంద్రా! నీయొక్క కన్నులు పరిపక్వమైన కమలములయొక్క మొగ్గలవలె వుంటున్నాయి. నీ ముఖము విచ్చిన కమలమువలె వుంటున్నది. నీ చేతులు, పాదములు కమల రేఖలుగా వుంటున్నాయి. నీ అందాన్ని చూస్తే ఈ లోకాన్ని యేమాత్రమూ ఆశించముకదా! కోటిమన్మథులైనా నీ కాలిగోటికి సరిరారు రామా!' అని వర్ణించాడు. ఈ పాటనే ఆనాటికి, నేటికి ఉత్తరప్రదేశములో యే సమావేశములు , యే మంగళకార్యములు జరిగినా దీనిని ఒక ప్రార్థనగా వినియోగించుకుంటున్నారు.

ఆవిధముగా అప్పటినుండి క్రమక్రమేణా ప్రాపంచికమైన సంబంధ బాంధవ్యాలకు దూరమైపోయి, భగవంతుని బంధనలో తాను ఆనందము అనుభవిస్తూ వచ్చాడు. మహనీయుల చరిత్రలు యీవిధముగా యిట్టివి, అట్టివి అని వర్ణించుటకు వీలుకానివి.